

# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

04 బుధవారం నవంబర్ 2026 పేజీలు: 3


## సంత్ రవిదాస్ మహారాజ్ 650 జయంతి ఉత్సవాలు



**కోదాడ - నవంబర్ 3 (సత్యనిష్ఠ)** కోదాడ మండలం లోని తొగర్రాయి గ్రామంలో సంతు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలు సామాజిక సమరసత వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో సామూహిక సన్మాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కోదాడ నియోజక వర్గంలోని నడిగూడెం మండలం కాగీత రామచ ంద్ర పురం గ్రామానికి చెందిన బాణాల అబ్రహంను ఘనంగా సన్మానించడం జరిగింది. బాణాల అబ్రహం అనే వ్యక్తి పేరు పక్కన సంతు రవిదాస్ మహారాజ్ స్ఫూర్తి తో అలియాస్ (బాణాల అబ్రహం మహారాజు) గా నామకరణం ఆమోదం. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బాధలు, భయాలు, కుల భేదాలు లేని సమరసత సమాజం నిర్మించాలని లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కోదాడ, హుజూర్నగర్ నియోజక వర్గల గ్రామాల పెద్దలకు సామూహిక సన్మాన కార్యక్రమం విజయ వంతంగా జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో నిర్వాహకులు, రెండు నియోజకవర్గాల వివిధ గ్రామాల పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మూడు రోజుల్లో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి




- **సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి**
- **ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**సత్యనిష్ఠ,మిర్యాలగూడ, నవంబర్ 3:** ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాల్ ద్వారా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, రాబోయే మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నాయకులు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు సాధించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 6వ తేదీన నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు లిశ్రీఅడ్లూరి లక్ష్మణ్ , నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో మిర్యాలగూడ నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు పిలుపుని చ్చారు... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవే రుస్తూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు... ఈ కార్యక్ర మంలో మిర్యాలగూడ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదు

- **డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలి..**
- **లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి..**
- **మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**





**మిర్యాలగూడ, సత్యనిష్ఠ, నవంబర్ 3:** ఈ నెల 6వ తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలోలబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి కాలనీలో గల బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించాలనే గొప్ప లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసిందని తెలిపారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో నిర్మించిన ఇళ్లను నిజమైన అర్హులైన లబ్ధిదారులకే కేటాయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, అర్హులైన పేదలను పక్కనపెట్టి అనర్హులకు ఇళ్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన పూర్తి జాబితాను బహిరంగంగా ప్రకటించాలని, ఎంపికలో అనుసరించిన నిబంధనలు, అర్హత ప్రమాణాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సొంత ఇళ్లు కలిగి ఉన్నవారు లేదా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులుగా ఉన్నవారు జాబితాలో ఉంటే వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు మిర్యాలగూడ బి ఆర్ ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించి ఇళ్ల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని కోరనున్నట్లు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హత ప్రాతిపదికన ఇళ్లను కేటాయించాలని, ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పేదల హక్కు.. వాటి కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకు టిఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిలబడి పోరాడుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమములో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎండి. ఇలియాస్ ఖాన్, ఎండి.మగ్దుం పాషా,బంటు శ్రీనివాస్,పెద్ది శ్రీనివాస్ గౌడ్, సందేషి అంజన్ రాజు, ఎండి. మాజీద్, తిరుమలగిరి వజ్రం, దైద సత్యం, గంగుల బిక్షం యాదవ్, జన్నపాల కిరణ్, దీపిక విజయ్, అరుణ్,ఎండి. అలీం రుక్షాన, బంటు దుర్గయ్య,పందిరి వేణు, వల్లపట్ల వినోద్,ఖలీల్, ఎక్క మనిదీప్,బిక్కన్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో వానల బీభత్సం, రెడ్ అలర్ట్



కోదాడ – నవంబర్ 3 (సత్యనిష్ఠ) బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడి తుఫానుగా మారింది. దీని ప్రభావంతో కోదాడ హుజూర్‌నగర్ నియోజకవర్గల వ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందులో భాగంగా నల్గొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, రంగారెడ్డి సహా మరో 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు సామాజిక మాన్యాలలో ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే రాగల 24 గంటల్లో గాలి వేగం పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు, ముఖ్యంగా పేదలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# ప్రజలకు,రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఆకస్మిక గాలివానలు, ఎల్‌నినో ప్రభావం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి

**మిర్యాలగూడ, సత్యనిష్ఠ, నవంబర్ 3:** నియోజకవర్గంలో ప్రస్తుతం కురుస్తున్న ఆకస్మిక గాలి వానలు, రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈరోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ (అగ్రికల్చర్), విద్యుత్ (ఎలక్ట్రికల్) శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఆకస్మికంగా వీస్తున్న ఈదురుగాలులు, కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు కలుగుతున్న నష్టాన్ని ఎప్పటికప్పుడు గుర్తించాలని, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు తెలిపారు.అలాగే రానున్న



రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా తలెత్తే వాతావరణ మార్పులు, వాటి వల్ల వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు గాలివానల సమయంలో విద్యుత్ అంతరాయాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు, ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత అని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత సత్యనారాయణ మృతి కాంగ్రెస్కు తీరని లోటు

- ఎమ్మెల్యే పద్మావతి, రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**కోదాడ – నవంబర్ 3 ( సత్యనిష్ఠ )** కోదాడ నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సూర్యాపేట జిల్లా మునగాల మాజీ ఎంపీపీ ఏనుగుల జయమ్మ భర్త, ఆయిల్ సీడ్స్ మాజీ చైర్మన్, దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్, ఏనుగుల సత్యనారాయణ (80) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి సుధీర్ తిరుపతమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీ నారాయణ రెడ్డి , కోదాడ మాజీ సర్పంచ్ పట్టణ కౌన్సిలర్ పార రీతయ్య, సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, సీనియర్ నాయకులు చింతలపాటి శ్రీనివాసరావు, సన్నీరు మురళి, నల్లపాటి శ్రీనివాసరావు , కొలిశెట్టి బుచ్చి పాపయ్య, నడిగూడెం మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, బూతుకూరు వెంకట్ రెడ్డి, బజ్జూరు వెంకటరెడ్డి, కీసర సంతోష్ రెడ్డి, వర్రప్రసాద్ రెడ్డి, ముసుకు శ్రీనివాస్ రెడ్డి , సీనియర్ జర్నలిస్ట్ రాష్ట్ర నాయకులు ఏనుగుల వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ నరాల రుక్కరావు , ఏనుగుల నాగేశ్వరరావు, శంకర్రావు, రామారావు, వెంకటేశ్వరరావు, తదితరులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. సత్యనారాయణ, మృతి పార్టీకి కుటుంబానికి తీరని లోటు అని వారు అన్నారు. అదే విధంగా సిపిఎం, సిపిఐ, టిడిపి, బిజెపి నాయకులు సంతాపం తెలిపారు.

# రైతు సంఘం ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి



- సీపీఐ(ఎం) నాయకుడు కల్లూరి మల్లేశం పిలుపు

**ఆలేరు రూరల్, నవంబర్ 3 (సత్యనిష్ఠ)** – నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రైతులకు, ప్రజలకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం రోజున ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామంలో రైతు మహాసభల విజయవంతం కోరుతూ నిర్వహించిన కరపత్ర ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటేల్‌గూడెంలో అనేక మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహాసభల నిర్వహణ కోసం విరివిగా విరాళాలు అందించారని, ఇదే రీతిలో అన్ని గ్రామాల రైతాంగం స్పందించాలని కోరారు. రైతు పంటకు గిట్టుబాటు ధర కోసం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 15న నల్లగొండలో లక్ష మందితో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించకుండా “రైతును రాజును చేస్తాం” అని ఎన్నికల ముందు ఇచ్చే వాగ్దానాలకే ప్రభుత్వాలు పరిమితమవుతున్నాయని విమర్శించారు. రైతుల చేతుల్లోని భూములను గుంజి కార్పొరేట్లకు అప్పజెప్పేలా మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలపై దేశవ్యాప్తంగా రైతాంగం పోరాడి గుణపాఠం చెప్పిందని గుర్తు చేశారు. అయినా నేటికీ అనేక అంశాలలో ప్రభుత్వ విధానాల్లో మార్పు రాలేదని, అందుకే రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, పటేల్‌గూడెం గ్రామ శాఖ కార్యదర్శి పిక్క గణేష్, పార్టీ నాయకులు గ్యార భాస్కర్, పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగణనపై బీజేపీ స్పందించాలి

- **జనగణనలో బీసీ కాలమ్ చేర్చే వరకు ఉద్యమం ఆపేది లేదుడిసెంబర్ 14,15న ఢిల్లీ రామ్ లీలా మైదాన్ లో బీసీ గర్జన - జాజుల లింగంగౌడ్**



**నల్లగొండ, నవంబర్ 3 (సత్యనిష్ఠ న్యూస్)** – దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ జనగణనలో బీసీల కాలమ్ పెట్టకుండా జనాభా లెక్కలు సేకరిస్తూ బీసీలను మోసం చేస్తున్నారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి, తీరా జనగణన చేపడుతున్న ఈ సమయంలో బీసీ కులాల లెక్కలు సేకరించకపోతే బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కే పరిస్థితి లేదన్నారు. దేశంలో అన్ని వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కల్పిస్తున్న కేంద్రం, బీసీల విషయంలో మాత్రం 60 శాతం జనాభా ఉంటే 27% రిజర్వేషన్లు కల్పించడం మూలంగా స్వాతంత్ర్యం సిద్ధించి 83 సంవత్సరాలు గడిచినా బీసీలకు సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారిఁన్యాయస్థానాలు కొట్టివేస్తున్నాయని, బీసీల శాస్త్రీయమైన డేటా లేకుండా బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కోర్టులు అంగీకరించడం లేదని ఆయన తెలిపారు. బీసీ డిమాండ్ల సాధన కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని, అందులో భాగంగానే డిసెంబర్ 14, 15 తేదీల్లో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో బీసీ గర్జన మహాసభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

# కొండమల్లేపల్లిలో తార్ గ్యాంగ్ సంచారం

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలిపోలీసుల హెచ్చరిక - అనుమానితులు కనిపిస్తే 112కు సమాచారం ఇవ్వండి**

**కొండమల్లేపల్లి, నవంబర్ 2 (సత్యనిష్ఠ న్యూస్)** – కొండమల్లేపల్లి గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజలకు పోలీసు కార్యాలయం నుండి ముఖ్య సమాచారం విడుదల చేశారు. మన ప్రాంతంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా “తార్ గ్యాంగ్” సంచరిస్తున్నట్లు పై అధికారులకు సమాచారం అందినందున ప్రజలు



జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే డయల్ 112 కు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని కోరారు. ఊళ్లకు వెళ్లే ప్రజలు ఇళ్లకు బలంగా ఉండే పెద్ద తాళాలు వేసి వెళ్లాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఇళ్ల వద్ద ఎవరైనా సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, తాము రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వెహికల్స్ పెంచామని తెలిపారు.

# ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **జాజుల లింగంగౌడ్లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం - కుటుంబానికి న్యాయం చేయాలి**



**హైదరాబాద్, నవంబర్ 3 (సత్యనిష్ఠ న్యూస్)** – తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి ఆదుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు ప్రభుత్వ ఆదరణకు నోచుకోక ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఉండాలని ఉద్యమకారులకు విజ్ఞప్తి చేశారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకొని వారికి అండగా నిలవాలని కోరారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని జాజుల లింగం గౌడ్ కోరారు.